## సింగిల్ పేజీ కథలు

# పెన్షన్


ఆరోజు ఆఫీసులో చాలా హడావుడిగా ఉన్నాడు భార్గవ్. దూరపు బంధువు చెప్పిన వార్తకి ఆత్రంగా మామగారి ఆఫీసుకు ఫోన్ చేశాడు.

''సుధాకర్‌గారు సెలవు పెట్టారు'' అవతల వైపు నుంచి వినబడగానే భార్గవ్ నీరుగారిపోలేదు.

''వారు వాలెంటరీ రిటైర్‌మెంట్‌కి అప్లై చేశారని విన్నాను''

''అవును, ఈ నెలాఖరుకి రిటైర్ అవుతారు. ఇంతకీ మీరెవరు?'' జవాబు చెప్పకుండా ఫోన్ పెట్టేశాడు భార్గవ్.

భార్గవ్ మామగారు నర్సారావుపేటలోని గవర్న



మెంటు ఆఫీసులో క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. భార్య చనిపోయింది. ఆయనకి ఇద్దరు పిల్లలు. పెద్దాడు సురేష్ ఉన్న ఊరిలోనే స్కూలులో టీచర్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య సుందరి.

సుధాకర్ రెండో సంతానం కుమారి. భారీగా కట్నమిచ్చి ఆమెని కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు భార్గవ్‌కి ఇచ్చాడు. పెళ్లయి నాలుగు సంవత్సరాలు దాటినా ప్రతి పండక్కీ అల్లుడికి ఘనంగా కానుకలిచ్చేవాడు సుధాకర్. మామగారు ఎంతిచ్చినా భార్గవ్‌కి ఎప్పుడూ పరగడుపే.

విజయవాడలో మంచి బియ్యం దొరకడం లేదని, కందిపప్పు ఖరీదుగా ఉందని పెద్ద లిస్టు రాసి మామగారికి పంపేవాడు. సుధాకర్ కిమ్మనకుండా అల్లుడు కోరిన సామాన్లు నర్సారావుపేట నుంచి పంపేవాడు.

మామగారు రిటైరవుతున్నారని తెలియగానే భార్గవ్ ఆశలకి రెక్కలు మొలిచాయి. సుధాకర్‌కి వచ్చే పెన్షన్, బెనిఫిట్స్ నాలుగు లక్షలకి తగ్గవని లెక్కలుగట్టాడు.

ఇక ఆలస్యం చేయలేదు. హుషారుగా సెల్ తీసి నర్సారావుపేటలో ఉన్న సుధాకర్‌గారింటికి రింగ్ చేశాడు.

భార్గవ్ దురదృష్టం కొద్దీ ''హలో...బావగారూ...బాగున్నారా?'' అవతల వైపు నుంచి పలకరించాడు సురేష్.

మామగారు కాక బావమరిది ఫోన్ అందుకున్నందుకు కుతకుతా ఉడికాడు భార్గవ్. కాస్త చికాగ్గా అడిగాడు.

''మామయ్యగారు ఎలా ఉన్నారు? ఇవాళ నీకు స్కూలు లేదా?''

''మా నాన్నగారు బాగానే ఉన్నారు. స్కూలు నుండి లంచ్‌కి వచ్చాను. ఏమైనా విశేషమా? కుమారి నన్ను మావని చేస్తోందా?''

''మీ చెల్లెలు ఆరోగ్యం అంతగా బాగుండటం లేదు'' ఇంతలో అవతలవైపునుంచి ''ఎవరితో మాట్లాడుతున్నావురా?'' అంటూ సుధాకర్ గొంతు పీలగా వినబడింది.

బలం పుంజుకున్నాడు భార్గవ్. ''మామయ్యగారి గొంతులా ఉంది. ఇంట్లోనే ఉన్నారా?''

భార్గవ్ మాటలు తుంచివేస్తూ, ''మా నాన్న ఇంట్లో లేరు. మిమ్మల్ని సస్పెన్స్‌లో పెట్టాలని గొంతు మార్చాను'' సురేష్ మాటలు తడబడుతున్నాయి.

''నన్ను సస్పెన్స్‌లో పెట్టడానికి నువ్వు సీరియల్ రైటర్‌వి కాదు. నేను చెవిలో పువ్వు పెట్టుకున్న రీడర్‌ని కాదు'' అంటూ నవ్వేసి సీరియస్‌గా, సూటిగా అడిగాడు.

''రిటైర్‌మెంట్‌కి ముందు మీ నాన్నగారు స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తున్నారా?''

''పెన్షనరీ బెనిఫిట్స్‌లో షేర్ కోసం మా నాన్నని కాకా పడతారా? అందుకే ఆయన్ని మీ ఇంటికి ఆహ్వానిస్తున్నారా?''

''కాకా ఎందుకు? కొడుకుని, కూతుర్ని రెండు కళ్లుగా చూసుకోమన్నారు పెద్దలు. మీ నాన్నకి వచ్చే డబ్బులో సగం మీ చెల్లెలుకి రావాలి''

''మాటలు పెంచకండి. బతికున్నంతకాలం ఆయనకి మేమే పెట్టాలి. మీరెంత అరిచి గీపెట్టినా ఆయనకి వచ్చే డబ్బులో పైసా కూడా ఇచ్చేది లేదు''

''అలా చెప్పడానికి నువ్వెవరివి? మీ నాన్నగారు చెప్పాలి. అయినా ఆయనకి ప్రతి నెలా పెన్షన్ వస్తుంది. మీరు ప్రత్యేకంగా ఆయనకి పెట్టేది ఏముంది?'' పాయింట్ లాగాడు.

అవతలవైపు ఫోన్ పెట్టేసిన శబ్దానికి భార్గవ్ మాడు పగిలింది.

సురేష్ ఎంతకైనా తెగిస్తాడు. సుధాకర్ హరీ అన్నా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. అప్పుడు చట్టరీత్యా పెన్షనరీ బెనిఫిట్స్ అతనికే వస్తాయి.

దూరాలోచన చేస్తున్నాడు భార్గవ్. చేతులు తీరిగ్గా ఉన్నప్పుడు చేసే వ్యవహారం కాదని గబగబా సెలవుచీటీ రాశాడు. నిమిషాల మీద కాలేజీ నుంచి ఇంటికి చేరాడు.

''మీ నాన్నని చూడాలని ఉంది.''

కుమారిని మాటలతో మభ్యపెట్టాడు. అతని పోకడకి ఆమె నొసలు చిట్లించింది. భార్గవ్ ఏదో ఎత్తులో ఉన్నాడని పసిగట్టింది. అయినా బయటపడలేదు. మౌనంగా అతని వెంట నర్సరావుపేటకి బయలుదేరింది.

సుధాకర్ పేపరు తిరగేస్తున్నాడు. ఆయన కుర్చీ

చుట్టూ చేరారు భార్గవ్ దంపతులు, సురేష్ దంపతులు. ముందుగా గొంతు విప్పాడు భార్గవ్. ''మామగారు... రిటైర్ కాగానే మీరు మా దగ్గరే ఉండాలి. విజయవాడలో మీకు బోలెడంత కాలక్షేపం'' మాటలు సాగదీస్తూ వంతపాడమని భార్య వంక చూశాడు.

భార్గవ్ ఎత్తు కుమారికి అర్థమయింది. పెన్షన్ డబ్బు కోసం వలవేస్తున్నాడు. మావని అల్లుడు తన్నుకుపోతాడని భయపడ్డాడు సురేష్. ''నన్ను పెంచి ఇంతటివాణ్ని చేశారు. మీరు పరాయికొంపలో ఉంటే నా తల కొట్టేసినట్లవుతుంది. మీరిక్కడే ఉండాలి. నా మాట విని మీరెక్కడికీ వెళ్లక ఇక్కడే ఉండండి'' వాదనకి దిగాడు.

పేపరు చదవడం ఆపి, శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాడు సుధాకర్.

అల్లుడూ, కొడుకుల ఫోన్‌వార్ ఆయన విన్నాడు. వాళ్ల అసలు రంగు తెలిసినా, అంతా వాళ్ల నోటి ద్వారా చెప్పించాలని ఆయన పరీక్ష పెట్టాడు.

''ఓకే. మీ దగ్గరే ఉంటాను. నాకు వచ్చే డబ్బులో మీకెంత కావాలో చెప్పండి'' సూటిగా వాళ్ల కళ్లలోకి చూశాడు.

అంత డైరెక్టుగా అడిగేసరికి నోట్లో పచ్చివెలక్కాయ పడినట్లుగా గిలగిల్లాడాడు సురేష్.

''ముందు డబ్బు రానీయండి. అంతదాకా మా ఇంట్లోనే ఉండండి. మీ అమ్మాయి వేడివేడిగా మీకు వండి పెడుతుంది. పైగా అల్లుడు కొడుకుతో సమానమన్నారు పెద్దలు అంటూ తన బాణీ మార్చాడు భార్గవ్.

తానేం తక్కువ తినలేదని అందుకున్నాడు సురేష్. ''ఏ క్షణంలో ఏం జరుగుతుందో ఎవరు చెప్పగలరు? తులసితీర్థం టైం పంచాంగకర్తలకి కూడా అందదు. అందుకని మీరిక్కడుంటేనే క్షేమం. బావగారింట్లో ఉసిరావకాయ లేదు. అవసానకాలంలో మీరు దాని నామస్మరణ చేస్తే వచ్చే జన్మలో ఉసిరావకాయలా పుట్టాలి. జాడీలో బూజులా పట్టాలి. ఇక్కడ ఉంటే మీకలాంటి కష్టం రాదు. హాయిగా హరీ అనవచ్చు''

''తండ్రి బతికుండగానే పాడె సిద్ధం చేసేవాడు కొడుకు కాదు. మామయ్యగారు నా దగ్గరే ఉంటారు'' అన్నాడు భార్గవ్.

''నైవేద్యం పెడితే శాంతిస్తాయి నవగ్రహాలు. ఎంత పెట్టినా దశమగ్రహం లాంటి అల్లుడి పొట్ట నిండదు. మా నాన్న మా దగ్గరే ఉంటారు'' గాత్రం పెంచాడు సురేష్.

''ఉండరు. మాతో విజయవాడ వస్తున్నారు''

''రారు. ఇక్కడే మా ఇంట్లోనే ఉంటారు.''

గాత్ర సమరంతో వాళ్లిద్దరూ చొక్కాలు పట్టుకునే స్టేజీకి వచ్చారు. సరిగ్గా అదే సమయంలో సుధాకర్ కొలీగ్ నరసింహారావు వచ్చాడు.

''గుడ్‌మార్నింగ్ సుధాకర్'' అంటూ ఆయనకి ఓ కవరు ఇచ్చాడు నరసింహారావు.

కవరు విప్పి చదివాడు సుధాకర్. ఆఫీసు ఆర్డర్ కాగితం అందరికీ చూపించాడు.

''ఉద్యోగానికి రాజీనామా చేశారా?'' ఆశ్చర్యంగా ఆవేశపడ్డాడు సురేష్.

''అనుమానం అనవసరం. మీ నాన్నగారి రాజీనామా అంగీకరించినట్లు ఆఫీసు ఆర్డర్‌లో ఉంది'' పళ్లు పటపటలాడించాడు భార్గవ్.

''జాబ్‌కి రిజైన్ చేస్తే పెన్షనరీ బెనిఫిట్స్ రావు, ఆఫీసు వాళ్లు వేసే పూలమాల తప్ప ఆయనకి చిల్లు గవ్వ కూడా రాదు. అయినా సుధాకర్‌గారు చాలా అదృష్టవంతులు. తమ దగ్గర ఉండమని ఆయన్ను పీక్కుతింటున్నారు కొడుకూ, అల్లుడు'' మెచ్చుకున్నాడు నరసింహారావు.

ముఖం చాటుచేశారు కొడుకు, కోడలు, అల్లుడు.

''పెన్షన్ డబ్బు కోసం అల్లుడు, కొడుకూ వీధి కుక్కల్లా పోట్లాడుకుంటారని మా నాన్న ఉద్యోగానికి రాజీనామా చేశారు'' స్వగతంగా అంటూ నవ్వింది కుమారి.

''మీరు ఆశించినట్లు నాకు లక్షలు రావు. నెల నెలా పెన్షన్ రాదు. ఎవరి దగ్గర ఉండమంటారు.''

సుధాకర్ ప్రశ్నకి జవాబివ్వడానికి ఆప్తమిత్రుడు నరసింహారావుతప్ప, అక్కడ ఎవరూ లేరు.

''కలిమి కలుపు తాత్కాలికం సుధాకర్. కలిమి చుట్టూ చేరిన కలుపు తీసేశావు. నువ్వనుకున్నట్లే పెన్షన్ డబ్బుతో ఓల్డేజ్ హోంలో హాయిగా ప్రశాంతంగా జీవించు'' అంటూ తను తెచ్చిన రాజీనామా ఆమోదిస్తున్నట్లున్న ఆఫీస్ ఆర్డర్ తీసుకుని చింపేసి జేబులో వేసుకున్నాడు నరసింహారావు.

**-కె. నాగేశ్వరరావు** (విజయవాడ)

# సానుభూతి

విజయవాడ రైల్వేస్టేషన్. కృష్ణా ఎక్స్‌ప్రెస్ కిటకిటలాడుతోంది. కాలు మోపడానికి చోటు దొరికినా ఎంతో అదృష్టం అనిపించేట్టుగా ఉంది. రష్‌కి తోడు బయటి నుంచి వీస్తున్న వేడి గాలి.

అరుణ్‌లో ఉన్న మెరుపు వేగం, అద్భుత నైపుణ్యం వల్ల ఆ రష్‌లో కూర్చోవడానికి సీటు సంపాదించాడు. కూర్చోగలిగాడే కానీ ముగ్గురు మనుషులు మూడు వైపులా ఇంచుమించు అతని మీదుగా నుంచున్నారు. తల తిప్పడానికి కూడా అవకాశం లేదు.

ఇంతలో చెరువులో అలలా... జనం ఒక్కసారి వెనక్కి విరుచుకుపడ్డారు.

''ఏంటి... ఏమయ్యింది'' దాదాపు తనమీదనే నుంచున్న వ్యక్తిని అడిగాడు.

''ఎవరో... బ్యాగ్... ప్లాట్‌ఫారం మీద మర్చిపోయారట'' చెప్పాడతను.

అరుణ్‌లో గూడుకట్టుకున్న అసహనం కట్టలు తెంచుకుని చిరాకుగా బయటికొచ్చింది.

''ఎవరండీ బాబూ... ఎక్కేటప్పుడు అంత ఒళ్లు తెలీదా''

ఆ వ్యక్తే అన్నాడు... ''పాపం లగేజీ చాలా ఉన్నాయి. ఎక్కే హడావిడిలో ఒకటి మరచిపోయి నట్టున్నారు''

ఇంతలో ఎదురు సీట్లో ఓ కాలేజీ అమ్మాయి కనబడటంతో, అప్రయత్నంగా రెచ్చిపోసాగాడు అరుణ్.

''ఆ... అదేం కాదండీ... ఎక్కేటప్పుడు తోసుకుని ఎక్కేయడం మీదున్న ధ్యాస... అయ్యో, మనం ఏం లగేజీ తెస్తున్నాం అన్న దానిమీద ఉండదు. వాళ్ల మతిమరపు కాదు కానీ... పక్కవాళ్లందర్నీ ఇబ్బంది పెట్టేస్తారు'' అన్నాడు.

రైలు కదిలింది. కాసేపటికి కానీ... కిటికీలోంచి బయటకు చూసే అవకాశం రాలేదు అరుణ్‌కి.

బయటకు చూసిన వెంటనే చిన్న అనుమానం, కొంచెం కంగారు మొదలయ్యాయి. రెండు నిమిషాలకి పరిసరాలు అర్థం అయ్యాయి.

అప్పుడు కనబడింది రాయనపాడు రైల్వే వర్క్‌షాప్. అనుకోకుండా పైకే అనేశాడు- ''అరే... ఇది హైదరాబాద్ వెళ్లే కృష్ణానా...''

వెంటనే పక్కనున్న ఆయన అందుకున్నాడు.

''అవునండీ... మీరు ఎటు వెళ్లాలి?''

బిక్కమొహం వేసుకుని నాలిక్కరుచుకుంటూ చెప్పాడు అరుణ్- ''తెనాలి వెళ్లాలండీ''

పక్కనున్న వాళ్లందరికీ అప్పుడు అర్థమయ్యింది. విజయవాడ స్టేషన్‌లో తిరుపతి వెళ్లే కృష్ణా ఎక్స్‌ప్రెస్సూ, హైదరాబాద్ వెళ్లేది... ఒకే సమయంలో... పక్కపక్కనున్న ప్లాట్‌ఫారంలో ఆగేసరికి- ఇతను ఒకటి ఎక్కబోయి మరోటి ఎక్కేసాడని.

''అయ్యయ్యో'' అన్నారు ఒకళ్లిద్దరు. ఆ సానుభూతి కూడా ఇబ్బందిగానే అనిపించింది అరుణ్‌కి. ఒక్కసారిగా లేచి జనాన్ని తోసుకుంటూ డోర్ దగ్గరకి నడవసాగాడు కనీసం కొండపల్లిలో అయినా దిగుదామని. ఇప్పుడు అతనికి ఎవరి ఇబ్బందీ గుర్తుకు రాలేదు.

ఆకాశంలో అరుణుడు మాత్రం చిరునవ్వు చిందిస్తూనే ఉన్నాడు ఎండ రూపంలో.

**-బొల్లాప్రగడ వెంకట పద్మరాజు**
(సత్యనారాయణపురం)